క్లుప్తంగా

వేడుకగా కంఠమహేశ్వర స్వామికి బోనాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటలో గౌడకులస్తులు వేడుకగా శ్రీ కంఠమహేశ్వర స్వామికి మంగళవారం బోనాలతో నైవేద్యం సమర్పించారు. తొలుత మహిళలు బోనంతో ఆలయానికి ర్యాలీ నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డిని గౌడ సంఘం బొట్టు పెద్దమనిషి వేముల చిన్న సాంబయ్య, సంఘం అధ్యక్షుడు మండ కుమార్, ఉపాధ్యక్షుడు దూపటి మల్లయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపగాని వెంకట్, కార్యదర్శి పోశాల రాంబాబు, నాయకులు దూపటి సుదర్శన్, తాళ్లపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



చెన్నారావుపేట : మండలంలోని ఈర్యతండాలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ మేడి సరోజన మంగళవారం అన్నప్రాసన చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆరాధన, తల్లిదండ్రులు ధరంసోతు రమ్యశ్రీ, లింగయ్య, గుగులోతు లలిత, గుగులోతు అనిత, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేటతండాకు చెందిన వివాహిత అదృశ్యమైంది. వివాహిత తండ్రి హనుమకొండలో పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సూర్యపేటతండాకు చెందిన కళావతి భర్త పూర్ణచందర్‌తో కలిసి హనుమకొండలో నివాసం ఉంటుండగా సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కళావతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరామర్శ



నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డిలను వారి మాతృమూర్తి జయశ్రీ ఇటీవల మృతి చెందిన క్రమంలో పట్టణంలోని వారి నివాసంలో మల్కాజ్‌గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ మంగళవారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి రాజేందర్, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాశీప్రసాద్, తిరుపతిరెడ్డి, గుగులోతు స్వరూప, గందె సుధాకర్, బైరి కృష్ణ, సిద్దం నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి సాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన పేద వృద్ధుడు వీరగోని కుమారస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం ఉబంటు సేవా సంస్థ ఆయనకు రూ.5 వేల సాయం అందజేసింది. సంస్థ ద్వారా అందిన డబ్బును కుమారస్వామికి స్థానిక ప్రతినిధి కర్ణకంటి రామ్మూర్తి మంగళవారం అందజేశారు. సంస్థ పేదలకు అండగా నిలుస్తుందని రామ్మూర్తి తెలిపారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి..

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన బిల్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి శ్రీనివాస్‌తో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు మంగళవారం రూ.20 వేల సాయం అందజేశారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి అతడి బాల్యమిత్రులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ స్నేహితులు కెత్తె వీరేందర్, తూముగంటి శ్రీకాంత్, చిగురు సుమన్, రాయపురి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పుస్తకాల అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్ విద్యార్థులకు సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి మంగళవారం వేమన శతకాల పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్కూల్ ఉపాధ్యాయురాలు ముదురు పద్మ వేమన శతక పుస్తకాలను బహూకరించిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న శివాలయం

- కాలగర్భంలో కలిసిపోతున్న ఆనవాళ్లు
- వారసత్వ సంపద పరిరక్షణలో నిర్లక్ష్యం



నేలకూలిన శిలలు, రాతి స్తంభాలు

ఖానాపురం : మండలంలోని దట్టమైన అడవుల్లో కాకతీయులు కట్టించిన శివాలయం కనుమరుగవుతోంది. వందల ఏళ్ల నాటి ఆలయం శిథిలమై ప్రస్తుతం ఆలయానికి వెళ్లే దారి మాత్రమే కనిపిస్తోంది. నాటి కట్టడాలు నేలకూలాయి. శివలింగం సైతం కనిపించకుండా పోయిన దుస్థితి నెలకొంది. ఆలయ చారిత్రక ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. సదరు వారసత్వ సంపదను పరిరక్షించడంలో ప్రభుత్వం, పురావస్తు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని అశోక్‌నగర్‌లోని దట్టమైన అడవుల్లో 1213లో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు పాకాల సరస్సు నిర్మించారు. కాకతీయ రాజులు తరచూ పాకాల అడవులకు వచ్చేవారని, ఈ క్రమంలో విడిది చేసేందుకు ప్రస్తుతం సైనిక్ స్కూల్ ఉన్న ప్రదేశంలో కోటను నిర్మించారు. దాని చుట్టూ నాలుగు మూలల్లో సైనికులు కాపు కాసేందుకు ఎత్తైన గోడలు నిర్మించారు. ఆ గోడలపై సైనికులు గుర్రాలపై తిరుగుతూ విడిదికి వచ్చిన రాజులకు రక్షణ కల్పించేవారు. అదే ప్రాంతంలో అశ్వశాల నిర్మించినట్లు చరిత్రకారుల ద్వారా తెలిసింది. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో శత్రుదుర్భేధ్యంగా మట్టి కోటను సైతం నిర్మించారు. యుద్ధాలు చోటు చేసుకున్నప్పుడు కాకతీయ రాజులు ఎక్కువగా ఇక్కడే సమావేశమై వ్యూహాలు రచించే వారని ప్రతీతి. యుద్ధాలకు, ఇతర ముఖ్య పనులకు వెళ్లే ముందు ఇక నిర్మించిన ఆలయంలో శివుడిని కొలిచే వారట. ప్రత్యేకంగా అందుకోసమే కోట మధ్య భాగంలో రాతి శిలలతో శివాలయాన్ని కట్టించారు. ఆ కాలంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయం నుంచి వరంగల్ కోట వరకు సొరంగ మార్గం ఉండేదని ప్రచారంలో ఉంది. యుద్ధాలు, అత్యవసర పరిస్థితుల్లో కాకతీయ రాజులు ఆ మార్గాన్ని ఉపయోగించుకునే వారని తెలిసింది.

శిథిల స్థితిలో ఆలయం

కాకతీయ రాజులు కట్టించిన మట్టి కోట, శివాలయం క్రమేనా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మట్టికోటకు బీటలు వారి మట్టిలో కూరుకుపోతుండగా అక్రమార్కులు మట్టిని తీసుకెళ్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఆలయం ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమైంది. ఆలయ నిర్మాణం కోసం వినియోగించిన రాతికట్టడాలు కనుమరుగవుతున్నాయి. ఆలయ ప్రాంతంలో నిత్యం గుప్త నిధుల కోసం పలుమార్లు తవ్వకాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఆలయం ఆనవాళ్లు కోల్పోతోంది. చారిత్రాక నేపథ్యం కలిగిన శివాలయాన్ని ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు స్పందించి పునరుద్ధరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నాం

అశోక్‌నగర్‌లోని శివాలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నాం. కాకతీయుల కాలం నాటి ఆలయం కావడంతో చారిత్రక ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. ఆలయం కనుమరుగు కాకుండా చర్యలు చేపట్టాం. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు గతంలోనే ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర పురావస్తు శాఖ అధికారులకు పంపించాము. ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. జిల్లా ఉన్నతాధికారులకు సైతం నివేదిక ఇచ్చాము. నిధులు మంజూరు కాగానే ఆలయ పునర్నిర్మాణ పనులు చేడపతాం.

\- మల్లునాయక్, ఏడీ, పురావస్తు శాఖ

నాటి టాపర్.. నేడు 'వెరిఫికేషన్' మెంబర్



శ్రవణ్‌కుమార్



టాపర్ల వివరాల బోర్డులో శ్రవణ్‌కుమార్ పేరు

నర్సంపేట : సరిగ్గా 35 ఏళ్ల క్రితం పదో తరగతి పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థి ప్రస్తుతం అదే పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ మెంబర్‌గా వ్యవహరించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో సదరు సభ్యుడిని నోడల్ అధికారి రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. డివిజన్‌లో చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన వివరాలిలా.. నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ అదే మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1988–89లో పదో తరగతి చదువుకుని స్కూల్ టాపర్‌గా నిలిచాడు. కాగా అదే స్కూల్ ప్రస్తుతం చేపట్టిన పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ సభ్యుడిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన టాపర్ల బోర్డులో శ్రవణ్‌కుమార్ పేరు ఉండడాన్ని గమనించిన ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన



ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్న సభ్యులు

నెక్కొండ : నోడల్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన కొనసాగుతోంది. మండలంలోని నెక్కొండ, చంద్రుగొండ, దీక్షకుంటల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో రవికుమార్ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం మార్కులను పరిశీలించింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. విద్యార్థుల రికార్డులు, రిజిస్టర్లు, ఫార్మెటివ్ అసెస్మెంట్‌లో సాధించిన మార్కులను పారదర్శకంగా పరిశీలించాలని సభ్యులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఇంటర్నల్ మార్కులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పరిశీలక బృందం సభ్యులు బూర్గుపల్లి శ్రవణ్‌కుమార్, రేణుక, రవీంద్రనాథ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం




క్రీడాకారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

- చైర్మన్, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండంలోని ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కొలన్‌పల్లిలో వంగాల యాకాంత, కొత్తూరులో ఆకారపు సోమక్క, వెంకటేశ్వరపల్లిలో మంద పద్మ, సన్నూరులో అల్లోజు కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయంతోపాటు బియ్యం, సరుకులు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నాయకులు కందికట్ల స్వామి, శ్రీను, తాటికాయల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



క్రీడారులతో సీఐ శ్రీనివాసరావు

వర్ధన్నపేట : మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. మంగళవారం వర్ధన్నపేట పోలీస్, జర్నలిస్టు టీమ్‌ల నడుమ మ్యాచ్‌ను ఏసీపీ అంబటి నర్సయ్య టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతోపాటు టోర్నమెంట్ నిర్వాహకులను ఏసీపీ నర్సయ్య, సీఐ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్, శ్రావణ్, రాంచరణ్, తేజ్, కానిస్టేబుళ్లు అశోక్, రమేశ్, చిరంజీవి, రవి, సర్వేశ్, జర్నలిస్టులు రమేశ్, రఘు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్స్, స్టేషనరీ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రంగారావు, తదితరులు

నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు విద్యుత్ శాఖ రిటైర్డ్ డీఈ చల్లా రఘోత్తంరెడ్డి పంపించిన పరీక్ష ప్యాడ్లు, ఇతర స్టేషనరీని హెచ్‌ఎం రంగారావు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. పూర్వవిద్యార్థి అయిన రఘోత్తంరెడ్డి విద్యార్థులకు ప్యాడ్లు, మెటీరియల్ అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జాన్‌నాయక్, ఉపాధ్యాయులు మీర్ ఇక్బాల్, శ్రీదేవి, రమేశ్, లక్ష్మణ్, వినయ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, పూర్ణిమ, రంజిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీకి తాగునీటి సరఫరా



తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : మండలంలోని అర్వనపల్లి శివారు బీసీ కాలనీకి అధికారులు మంగళవారం తాగునీటి సరఫరా చేశారు. 'బీసీ కాలనీలో తాగునీటి గోస' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఎంపీఓ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ (మిషన్ భగీరథ) ఏఈ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి మౌనిక కాలనీని సందర్శించారు. కాలనీవాసులతో చర్చించారు. తాగునీటి సరఫరాలోని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరాను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అనంతరం అధికారులు మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి ఇంటింటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వన నర్సరీలో క్షుద్రపూజలు



నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి వనన ర్సరీలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి క్షుద్రపూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మల్టీపర్పస్ వర్కర్ కుమార్ మొక్కలకు నీళ్లు పట్టేందుకు వెళ్లగా క్షుద్రపూజలు జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులకు, అధికారులకు కుమార్ సమచారం అందించగా ఎస్సై గోవర్ధన్ వన నర్సరీని సందర్శించి విచారణ చేపట్టారు. మూఢనమ్మకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నర్సరీని ఎంపీటీసీ దేవ్ సింగ్, బొమ్మిడి శివారెడ్డి, తదితరులు సందర్శించి పరిశీలించారు.

నేడు నిరసన

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నేడు (బుధవారం) వరంగల్ నగరంలోని హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నిరసన తెలుపుతామని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించి నూరు శాతం బీమా ఎఫ్‌డీఐని ఉపసంహరించాలని, ఇతర డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నిరసనను జయప్రదం చేయాలని కోరారు.

భారీగా గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



గీసుకొండ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ బీట్ బజార్ (హోల్‌సేల్ కాంప్లెక్స్)లో భారీగా గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించగా కాంప్లెక్స్‌లోని ఆవర్ల శ్యాం అనే వ్యక్తి మహాలక్ష్మి ట్రాన్స్‌పోర్టు పేరుతో షాపు నంబర్ 67లో నిల్వ చేసిన రూ.84 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను జనగామ జిల్లాలోని పాలకుర్తిలోని భవానీ కిరాణ దుకాణానికి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుట్కా ప్యాకెట్లను శ్యాం వరంగల్‌లోని జబ్బార్ సింగ్ నిర్వహిస్తున్న హరీశ్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందని చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును స్థానిక పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : విద్యార్థులు మెరుగైన ఉద్యోగాలు పొందాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో రుచిత అసోసియేట్స్ సౌజన్యంతో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు జాబ్ మేళా చక్కని అవకాశమని చెప్పారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ రహీముద్దీన్ మట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ కంపెనీలు జాబ్ మేళా నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు జాబ్ మేళాను వినియోగించుకోవాలని కోరారు. రుచిత అసోసియేట్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జోసఫ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ సోమయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని కంపెనీలతో జాబ్ మేళా ఏర్పాటు చేసే దిశగా చొరవ తీసుకుంటామన్నారు. వివిధ కంపెనీల కోసం విద్యార్థులను ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ కందాల సత్యనారాయణ, అధ్యాపకులు రాంబాబు, రాజీరు, రజిత, సంధ్య, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

'అన్నారం' తలనీలాల మాయంపై విచారణ



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ బాబా దర్గాలో తలనీలాల మాయం ఘటనపై గ్రామస్తుల సమక్షంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి టి.రమేశ్ మంగళవారం విచారణ చేపట్టారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ ఒక క్షురకుడితో కుమ్మక్కై రూ.30 లక్షల సరుకును గుట్టుగా అమ్ముకుని కేవలం రూ.5 లక్షలు మాత్రమే బోర్డుకు జమ చేశాడని గ్రామస్తులు ఆరోపించారు. 2023లో రూ.28 లక్షలకు టెండర్ కాగా 2024లో టెండర్ నిర్వహించలేదని, తాజాగా 2025లో దాచి ఉన్న ఆడవారి వెంట్రుకలను కాజేసి మగవారి వెంట్రుకలు చూపిస్తున్నారని అధికారికి వివరించారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు తెలిపారు. సరుకు తక్కువగా ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని చెప్పారు. దర్గా కల్యాణకట్ట వద్ద పర్యవేక్షణ లేదన్నారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ, దుర్గమ్మ పండుగ



తలపై గంపతో వస్తున్న ఝాన్సీరెడ్డి, తదితరులు

రాయపర్తి : మండలంలోని కొండూరులో ఎల్లమ్మ, జేతురాంతండా పరిధిలోని రావులతండాల్లో దుర్గమ్మ పండుగలు మంగళవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కొండూరులో నిర్వహించిన పండుగకు ఝాన్సీరెడ్డి యాదవ కులస్తులతో కలిసి తలపై గంపతో ఎల్లమ్మ తల్లిని పూజించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎల్లమ్మ, దుర్గమ్మ పండుగలను సంస్కృతికి నిదర్శనాలుగా అభివర్ణించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల నర్సయ్య, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

సుందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలి



ప్రచారం చేస్తున్న సారయ్య, తదితరులు

- సంఘం జిల్లా అధ్యక్షుడు సారయ్య

నర్సంపేట : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌రాజ్ యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సొల్తి సారయ్యగౌడ్, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు కోరారు. పట్టణంలోని అంగడి సెంటర్, పటేల్ నగర్, టీచర్స్ కాలనీలో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సారయ్య, రాజు మాట్లాడారు. బీసీలు సుందర్‌రాజ్‌ను గెలిపించి ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్‌యాదవ్, ఆచార్య విద్యాసంస్థల డైరెక్టర్ జీజుల సాగర్, తెలంగాణ ఉద్యమకారుడు సాంబరాతి మల్లేషం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలారపు నరేందర్, నాయకులు మద్దెల శ్యామ్, రమేష్, రామగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రవీందర్‌ను గెలిపించండి

- ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



సభ్యత్వం ఇస్తున్న పర్వత్‌రెడ్డి

పర్వతగిరి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని వివిధ పాఠశాలలను ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించి యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా పర్వత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షనర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మూల మధులమామె, మండల బాధ్యులు నిరంజన్, శ్రీధర్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీకి చెక్



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

నల్లబెల్లి : అవగాహన పెంచుకోవడం ద్వారానే హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు చెక్ పెట్టగలమని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. మండలంలోని అర్వనపల్లి శివారు బొల్లోనిపల్లిలో వైఆర్‌జీ కేర్ ఎల్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై చర్చించారు. హెచ్‌ఐవీ బాధితులు వైద్యుల సూచన మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ వ్యాపించేందుకు కారణమైన అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కరప్రతాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వైఆర్‌జీ కేర్ సూపర్‌వైజర్ రజని, క్లస్టర్ వర్కర్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.